# 8

# కుడి,
# యెడమల
# దగా,
# దగా
# ...!

'మంజుశ్రీ'

మనస్సు రహదారి కాగా చేసుకున్న పాపాలు మైలు రాళ్లవలె కన్పిస్తున్నాయని యెక్కడో, ఎవరో అన్నారు. ఎప్పుడో నేను విన్నాను.

ఒక అందమైన ఉదయం, ఒక చల్లటి సంజవేళ, ఒక నిద్రపట్టనిరాత్రి, ఒక బాధపడిన ఘడియ నువ్వెవరని ప్రశ్నించుకున్నప్పుడు—

అహంకారాన్ని, అజ్ఞానాన్ని, అహంభావాన్ని, కామాన్ని, నీచాన్ని, అపవిత్రతని అని ఇలానే ఇంకా యెన్నో...

అని ఇవాళ చెప్పుకుంటాను.
కిటికీలోంచి వీధికేసి చూస్తున్నాను.

ఒక్క అయిదు నిమిషాలసేపు చిన్న వానజల్లు పడి వెలిసింది.

దూరంగా ప్లీడరుగారింట్లో పున్నాగచెట్టు.
కార్తీక మాసం.
పున్నాగ పువ్వుల వాసన ఇక్కడిదాకా వస్తున్నది.
ఒక్కొక్క పువ్వే రాలి రోడ్డుమీద పడుతోంది.
ఎవరో చిన్న పిల్ల వాటి నేరుకుంటున్నది.
యెండపొడ. వానజల్లు. అందమైన ఉదయం.
గడ్డం గీసుకుందామని కూచున్నాను.
హాలులో పిల్లలు వుల్లాసంగా గెంతుతున్నారు.
మధ్య మధ్య ఆవిడ వాళ్లపై అరుస్తున్నది.
కళ్లు చెమర్చాయి. గుండె గుబగుబలాడింది.

అయిపోయింది. నాపనీ అయిపోయింది. నిమిషంలో నేను చచ్చిపోయినా? ఏమిటోపారేసుకున్నాను. శాశ్వతంగా.

అన్నిటికన్నా అందంగా మెరుస్తోంది.
గడ్డంపైని తెల్లగా. నేను గడ్డం చేసుకోను.
అవసరంలేదు.
ఎప్పుడో పారేసుకున్నాను యువ్వనాన్ని.
ఇప్పుడు అంతా పోయింది.
సింహావలోకనం చేసుకోనా?
ఎందుకీ దిగులు?

అయిపోయింది పగలు.

ఇరవై అయిదో పుట్టినరోజు పండుగనాడు యెంత దుఃఖం వచ్చింది. పెద్దవాణ్ణవుతున్నాను.

రేపో మాపో నలభై అయిదు.

చిట్టి వచ్చింది, స్నానంచేసి.

'నాన్నా కాస్త బయట కెళ్ళండి.'

మంచుకు తడిసిన గులాబిపువ్వులా. అవును నా రక్తానికి పదిహేనేళ్లు.

పెళ్లి చెయ్యాలి. ఏమిటో అమ్మ గొడవపెడుతున్నది..

పట్టు తగిలించుకుని వీధిలోకి నడిచాను. సిగరెట్లు తెచ్చుకోవాలి. పున్నాగపువ్వులా కార్తీకమాసం.

పువ్వులు రాలుతున్నాయి. ఎవరో పిల్ల వాటి నేరుకుంటున్నది. మనస్సు కేమి టీ వింత అనుభూతి.

ఎవ రీ పాప, ఎవరో గుర్తొస్తున్నారు.

నేనండీ సుందరినీ...

అవునా సుందరీ, సుందరీ...

చిన్నప్పుడు సుందరి అచ్చం ఇలానేవుండేది.

నాకు బాగా తెలుసు. పున్నాగపువ్వు లేరుకున్నాం.

అప్పుడామెను నేను ప్రేమించాను.

పదేళ్ల పిల్లప్పటినుంచీ పదిహేనేళ్ల పిల్లప్పటిదాకా నాకు తెలుసు. పనిలేకపోయినా రోజూ పలకరించేవాణ్ణి.

ఎన్ని కథలపుస్తకాలు రోజూ చదువుకునేందు కిచ్చాను!

అవును, ఆమెను నేను ప్రేమించాను.

నేను కాలేజీకి పోయే టైమూ, ఆ పిల్ల స్కూలు నుంచి వచ్చే టైమూ ఒకటే.

రోజూ ఎదురుపడి...
'సుందరీ టైమెంత :'
చిరునవ్వుతో 'పదింబావూ...'
పదింబావూ, పదింబావూ, పదింబావూ......
మూడేళ్ళు...
అవును నే నామెను ప్రేమించాను.

డాబామీద కెక్కి జడ అల్లుకుంటుంటే, పువ్వులు గుచ్చుకుని పెట్టుకుంటుంటే, పౌడరు రాచుకుంటుంటే, అద్దంలో ముఖం చూసుకుంటుంటే నేనుచూసే...నేనేం చెయ్యాలి. డాబాయెక్కి బాదంచెట్టు పక్క నిలబడితే నాక్కనపడు తుంది. నే నేం చెయ్యాలి. చూసేను. అవును మరి. నే నామెను ప్రేమించాను.

ఇప్పు డనుకుంటాను. నే నామెను ప్రేమించానా?

ఏమో? ఆమెకు పెళ్ళయి యేడాది గడవకముందే పిల్లవాణ్ణి కన్నదాకా ప్రేమించాను. తరువాత లేదు.

అప్పుడు నే నలానే వుండిపోయాను.

## మొదటి మైలురాయి

ఒక్క సంవత్సరం స్కూలు మేష్టరుగిరీ వెలిగించాను.

లెక్కలు చెప్పేవాణ్ణి.

ఆ అమ్మాయి పేరు బాల. ఆ అమ్మాయేం బాల కాదు.

పదిహేనేళ్ళు వుంటాయి.

వాంఛతో గుండె ఆర్చుకునిపోయేది.

అస్తమానూ ఎందుకు నిశిరాత్రి నీలాకాశంలో చంద్రవంకవలె ఆ పెదాలపై చిరునవ్వు.

నన్ను చూసే...అమ్మో బ్రతక లేను.

నోటుపుస్తకం తీసుకుని సైన్ చేస్తుంటే, జామెట్రీ బొమ్మలు గీచిపెట్టి బోధపరుస్తుంటే ఎందుకా చిరునవ్వు... అందుకే—

యానివర్సరీనాడు చీకట్లో సింగారించుకొని వచ్చింది. పాపం...బాల. మంచిది. చెడుతలపు లేమీ లేవు.

నాకే...

ఏదో పాట పాడింది. ఏదో వేషం వేసింది.

గుడ్డలు మార్చుకుందుకు గ్రీన్ రూములోకి పోయినప్పుడు మెచ్చుకుంటానికి వెళ్లాను.

చీకటి. పెట్రోమాక్సులైటు మరణవేదన.

కావిలించుకున్నాను. క్షణం భయం. అసహ్యం. వాంఛ. రోత. నామీద నాకే...

పొద్దున్నే క్లాసులో మొహ మెలా చూడను?

వారంరోజులు సెలవుపెట్టాను.

మళ్లీ స్కూలుకి వచ్చిననాడు——

అర్థమైనట్లు నవ్వింది. ఆకలిగా చూసింది.

సిగ్గుతో కృంగిపోయాను రసాతలానికి. ఎంత అన్యాయం చేశాను. ఉద్యోగాన్ని వదలిపెట్టాను.

## రెండో మైలురాయి

చీకటిరాత్రి. జడలు విరబోసుకున్న దయ్యంలావుంది చీకటి. అంతా నిద్రిస్తున్నారు.

అల్లంతదూరాన ఎన్నాళ్లనుంచో రెచ్చగొడుతున్న అమ్మాయి. నిద్రపోతూంది. తరువాత యెవరికో చెపితే అన్నారు దొంగనిద్రని. అవునేమో!

చుట్టూ మంచాలు. వెళ్లాను. తాకాను. కదిలింది. వచ్చేశాను భయంతో. తరువాత అసహ్యం. నామీద నాకే——

ఆ అమ్మాయికి తెలిసిందా——

తరువాత చాలా ఆప్యాయంగా మాటాడింది మర్రోజు.

తెలీదా——? మరి ఇష్టమా.

ఏమో? ఎవరికి తెలుసు?

నేనుమాత్రం సిగ్గుతో కుంగిపోయాను. పశువుని.

అలా అంటే పశువులకీ అన్యాయమే.

## మూడో మైలురాయి

ఇలానే ఇంకా ఇంకా, యెన్నో యెన్నో చెప్పరానివి.

ఇవాళ ఇంతదూరంవచ్చాక వెనక్కు తిరిగి చూసుకుంటే ఏమున్నది?

దగా...మోసం. వంచన.

సిగరెట్లు తీసుకున్నాను. ఒక్కజల్లు. కాస్త తెరిపి. సిగరెట్ వెలిగించాను.

వస్తున్నాను.

పున్నాగచెట్టు పువ్వులు.

ఒడినిండా పూలునిండాయి. పాప వెళ్ళిపోతున్నది. పదేళ్ళపాప.

చక్కటి పాప. సుందరిలాటి పాప.

ప్లీడరుగారిల్లు దాటుతున్నాను.

సుందరి యెదురుపడింది.

ఎక్కువ ఆశ్చర్యపడకుండానే — 'ఓహో మీరా!'

చిన్ననాటి సుందరి.

చెప్పుకపోతున్నది.

'ప్లీడరుగారు మా బావగారు. రాత్రి వచ్చాము.

'పాపా నువ్వెక్కడికి వెళ్లావే...ఇన్ని పూలా...చాలునా...మొద్దుముండా, వానలో తడిస్తే జబ్బు చేస్తుంది...'

'ఈ పిల్ల...?'

'మా చిన్నపిల్ల. ఏం అలాచూస్తారు.'

'ఏంలేదు. చిన్నప్పుడు నువ్వెలా వుండేదానివో ఆలోచిస్తున్నాను.' పైకి అనలేదు.

సుందరి వెళ్లిపోయింది పాపతో.

సుందరిని ప్రేమించానా?

ఏమో—

బాలని ప్రేమించానా?

నాకు తెలీదు.

చీకట్లో అమ్మాయిని ప్రేమించానా?

ఛీ...ఛీ...

సుందరిని ప్రేమించానా?

ఒకప్పుడు.

బాలని ప్రేమించానా?

ఒకరోజు...

చీకట్లో అమ్మాయిని?

ఒక్కరాత్రి...ఒక్కక్షణం.

ఇంటికి వచ్చాను.

సిగరెట్ పారేశాను.

చిట్టి వచ్చింది.

'నాన్నారూ...నాకు ఒక్క రూపాయివ్వరా...'

'ఎందు కమ్మడూ...'

'రిబ్బన్లు కొనుక్కోవాలి...'

ఐదు రూపాయలు తీసి ఇచ్చాను.

చందమామ మొహంలాంటిది చేసుకుని వెళ్ళిపోయింది.
మళ్ళీ కిటికీవారిగా కూచున్నాను.
దూరంగా ప్లీడరుగారింట్లో పున్నాగ చెట్టు.
ప్లీడరుగారింట్లో సుందరి.
జ్ఞాపకాల తెరలని చీల్చి చూడు.
ఆరేళ్ళ సుందరి. పన్నెండేళ్ళ సుందరి. పదిహేనేళ్ళ సుందరి.

చదువు పోగొట్టుకున్నాను. కాలేజీ పోగొట్టుకున్నాను.
సుందరి యెక్కడ కనపడుతుంది?
ఇవాళ ఏ గుడ్డలు తొడుక్కొంను?

నా గొంతు విప్పితే గాడ్దెలుకూడా అసహ్యించుకుంటాయి.

అటువంటిది సుందరి విని సంతోషించాలని పాటలు పాడేవాణ్ణి. ఎన్ని పాటలు పాడేవాణ్ణి.
సుందరికి చెప్పాను ఎన్నిసార్లో.
'నిన్ను ప్రేమిస్తున్నాను.'
ఆ రోజుల్లో ఇలా ఆలోచించేవాణ్ణి.
సుందరి నాది కాకపోతే బ్రతకగలనా?

బ్రతకలేను. బ్రతకలేను. ముమ్మాటికి బ్రతకలేను—అనుకునేవాణ్ణి. మరి బ్రతకలేదూ—సుందరి అందమైనవాణ్ణి చేసుకుంది, చాలా ఆస్తివంతుణ్ణి.
యేడాది గడవకముందే పిల్లవాణ్ణి కన్నది.

వాణ్ణి చూసినప్పుడు నాగుండె దుఃఖంతో మూలిగింది.
తరువాత నేనూ పెళ్ళి చేసుకున్నాను.
పిల్లల్ని కన్నాను.
ఏమిటి సాధించాను ?
ఎంతమందిని వంచించాను.
ఎన్నిమార్లు వంచించుకున్నాను నన్ను నేను.
కిటికీ పక్కన కూచున్నాను.
దూరంగా పున్నాగచెట్టు.

బావిదగ్గర అమ్మ కార్తీకమాసం కాబట్టి తలమీద స్నానం చేస్తున్నదిలా వుంది. ఏమిటో పాటలు పాడుకుంటు న్నది.

చిట్టి వచ్చింది. 'వీణ్ణి తీసుకో నాన్నా—'
చిన్నపిల్లాణ్ణి వొళ్లో కూచోబెట్టుకున్నాను.
వాడు గడ్డాన్ని బుల్లివేళ్లతో పుణుకుతున్నాడు.
పట్టి లాగుతున్నాడు.

ఏమిటో పరీక్షగా చూస్తున్నాడు. వీడికి తెలిసిందా నేను ముసలివాణ్ణయినానని.

ఆవిడ ఉప్పెనలా వచ్చింది.

'అయినట్టే వుంది నిర్వాకం...ఇలా అయితే యిక బ్రతికినట్లే...ఇలా పెంచండి. రేపు వచ్చేవాడెవడో మన వుసురుపోసుకోవటానికా...'

ఏమిటన్నాను.

'చిట్టి కెందు కైదు హూపాయ లిచ్చారు' అన్నది.
దగ్గరకు రమ్మన్నాను.
విసుక్కుంది.
చెపుతాను అన్నాను.
వచ్చింది.
'నిన్ను ప్రేమిస్తున్నాను' అన్నాను.

నోరు నొక్కుకుని నవ్వింది. తనకు తెలుసును నే నెప్పుడూ యేదో ఇలానే అస్తవ్యస్తంగా మాట్లాడుతుంటా నని.

చేతుల్లోంచి పిల్లాణ్ణి తీసుకుని ముద్దెట్టుకుంది.
దూరంగా పున్నాగ చెట్టు.
ఆ ఇంట్లో సుందరి.
ఆ సుందరి కెన్నిమార్లు చెప్పా నీమాట.
'ప్రేమే' ననుకుని యెంతమందిని ప్రేమించాను.
వంచన, దగా, మోసం——
జీవితంలో ప్రతి దశలోనూ ప్రతి కోణంలోనూ.
ఆవిడ ముసలి దవుతోంది.
కొత్తగా చూశాను.
'నిజం' అన్నాను.
ఆవిడ నవ్వింది, అమాయకంగా.

*